క్లుప్తంగా

ఏటీవోగా మహమ్మద్ తాజుద్దీన్ బాధ్యతలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఏటీవో(అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్)గా మహమ్మద్ తాజుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే పదవీ విరమణ చేసిన రాములు స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామానికి చెందిన శెట్‌పల్లి ముత్తెన్న కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో రూ.2,50,000ల ఎల్‌వోసీని అందజేశారు. ఇస్సాపల్లి గ్రామానికి చెందిన ముత్తెన్న అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ఇందుకు సంబంధించిన ఎల్‌వోసీని బాధితుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

పోల్ ట్యాక్స్ పెంపును తగ్గించాలని వినతి



రెంజల్(బోధన్): పోల్ ట్యాక్స్ పెంపును ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతూ మండలంలోని కేబుల్ ఆపరేటర్లు ట్రాన్స్‌కో ఏఈ మగ్దుంకు బుధవారం వినతిపత్రం అందించారు. ప్రతి విద్యుత్ స్తంభం ఆధారంగా టాక్స్ వసూలు చేస్తే తమ పరిస్థితి దారుణంగా మారుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గత 10, 15 సంవత్సరాలుగా కేబుల్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న తమకు జీవనోపాధి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సెటప్ బాక్సులు రావడంతో కనెక్షన్‌లు పూర్తిగా తగ్గిపోయాయని వాపోయారు. కేబుల్ ఆపరేటర్ల సంఘం మండల అధ్యక్షుడు ఇస్మాయిల్, సాయరెడ్డి, నారాయణ, హరిబాబు, తదితరులున్నారు.

ప్రతిభ చూపిన పూర్వ విద్యార్థికి అభినందన



డొంకేశ్వర్(ఆర్మూర్): పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన పూర్వ విద్యార్థి కృష్ణసాయి గౌడ్‌ను డొంకేశ్వర్ జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు. రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు సాధించి నూత్‌పల్లి గ్రామాన్ని, పాఠశాల కీర్తిని నిలబెట్టారని హెచ్‌ఎం సురేశ్ కుమార్ అన్నారు. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'అక్షర పల్లకీ'ని ప్రారంభించిన డీఈవో



వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు ఆచార్య ఆత్రేయ రూపొందించిన అక్షర పల్లకీ కార్యక్రమాన్ని డీఈవో అశోక్ బుధవారం వేల్పూర్ హైస్కూలులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షర పల్లకీ ద్వారా విద్యార్థులు చదువులో ముందుండాలని కోరారు. పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. స్కూలుకు మొదటిసారి వచ్చిన ఆయనను పాఠశాల తరఫున శాలువాతో సన్మానించారు. హెచ్‌ఎం రాజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతల చింత తీరేదెన్నడు..?



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి, రెంజర్ల గ్రామాల మధ్య గల రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. రోడ్డు మరమ్మతుల కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.1.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. మంగళవారం భారీ వర్షం కురవడంతో గుంతల్లో నీరు నిలిచింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలకు మొక్కల పంపిణీ

బాల్కొండ: వన మహోత్సవంలో భాగంగా ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో బుధవారం మహిళ సమాఖ్య సభ్యులకు జీపీ కార్యదర్శి నరేశ్ ఇంటికి రెండు మొక్కల చొప్పున మొక్కల పంపిణీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటి ఆవరణలో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు.

ఫిర్యాదు చేయాలంటే..

పది కిలో మీటర్లు వెళ్లాల్సిందే

- డొంకేశ్వర్ మండలంలో ఏర్పాటుకాని పోలీస్‌స్టేషన్
- నందిపేట్‌కు వెళ్లి రావాల్సిన పరిస్థితి



డొంకేశ్వర్(ఆర్మూర్): పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. తహసీల్, ఎంపీడీవో, వ్యవసాయ కార్యాలయాలు వచ్చినా డొంకేశ్వర్ లాంటి కొత్త మండలాల్లో ఇంత వరకు పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కాలేదు. దీంతో ప్రజలు ఫిర్యాదులు చేయాలంటే నందిపేట్ మండలానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. డొంకేశ్వర్ నుంచి ఐతే పది కిలో మీటర్లు, అన్నారం, సిర్పూర్, జీజీ నడ్కుడ, గాదేపల్లి, చిన్నయానం, గంగాసముందర్, మారంపల్లి, నూత్‌పల్లి, నికాల్‌పూర్ గ్రామాలకై తే నందిపేట్ 15కిలోమీటర్ల దూరం అవుతోంది. ఫిర్యాదు చేసి రావడానికి సగం రోజు గడిచిపోతుందని, ఎస్సై స్థానికంగా లేకపోతే వచ్చే వరకు వేచి చూస్తే రోజంతా అవుతోందని డొంకేశ్వర్ మండల ప్రజలు వాపోతున్నారు. కేసుల విషయంలో పలుమార్లు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రావడం ఇబ్బందిగా మారిందని, అదే డొంకేశ్వర్‌లో ఏర్పాటు చేస్తే అందరికి అందుబాటులో ఉంటుందన్నారు.

శాంతి భద్రతల పర్యవేక్షణ లేదు...

డొంకేశ్వర్ మండలంపై నందిపేట్ పోలీసుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. పేకాట, గంజాయి లాంటి కార్యకలాపాలు మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో జోరుగా జరుతాయని తెలిసినా కూడా ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. స్థానికంగా పోలీస్ స్టేషన్ ఉంటేనే అసాంఘీక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడే అవకాశముంది.

పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి..



మండలంగా ఏర్పడి రెండేళ్లు అవుతున్నా డొంకేశ్వర్‌లో పోలీస్ స్టేషన్ లేదు. మండల ప్రజలు ఫిర్యాదు చేయాలంటే మళ్లీ నందిపేట్‌కు వెళ్లాల్సి వస్తోంది. అంతదూరం పోయి రావడం కష్టం అవుతుంది. ప్రభుత్వం స్పందించి స్థానికంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. – ప్రవీణ్ రెడ్డి, జీజీ నడ్కుడ

నేటి చిత్రం

గుంతలమయంగా రోడ్డు



రుద్రూర్ : మండలంలోని సులేమాన్‌నగర్ నుంచి రాయకూర్, పెంట వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షం కురిసినపుడు గుంతలో వరద నీరు నిండి గుంత ఎక్కడ ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చి రోడ్డు మరమ్మతు చేయించాలి.

–దినేష్ , రాయకూర్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

విద్యార్థి దశలో ఇంటర్ కీలకం

- మెరుగైన ఫలితాలు సాధించాలి
- కోటగిరి జూనియర్ కాలేజీలో మొక్కలు నాటిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం



కోటగిరిలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్ : విద్యార్థి దశలో ఇంటర్ కీలకమైందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం వనమహోత్సవంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. అనంతరం కళాశాలను సందర్శించి ప్రగతి, విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రిన్సిపాల్, అధ్యాపకుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తుంటే సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత లేదా అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని, మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ జిల్లా అధికారి రవి కుమార్, తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ హన్మంతు, సింగిల్ విండో చైర్మన్ కూచి సిద్దు, నాయకులు కొట్టం మనోహర్, పుప్పాల శంకర్, ఏజాజ్‌ఖాన్, పత్తి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మోస్ట్ ఇన్నోవేటివ్ స్కూల్‌గా స్మైల్ ది స్కూల్ ఎంపిక



ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని 'స్మైల్ ది స్కూల్' మోస్ట్ ఇన్నోవేటివ్ స్కూల్ అవార్డును అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రఫీక్ గోహర్ అన్నారు. ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డ్స్ 2025 కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి ముంబై నోవాటెల్ హోటల్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమంలో టాలీవుడ్, బాలీవుడ్ నటిమణి తమన్నా భాటియా చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పొడవునా నిర్వహించిన విద్యా, సహపాఠ్య కార్యక్రమాలను పరిశీలించి ఈ గౌరవాన్ని ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రుల మద్దతుతోనే ఈఘనత సాధ్యమైందన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

- కానరాని సూచిక బోర్డులు
- ఇరుపక్కలా పెరిగిన పిచ్చిమొక్కలు
- నందిపేట మండలంలో ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



బజార్ కొత్తూర్- ఉమ్మెడ గ్రామాల వద్ద ఉన్న మూల మలుపు

నందిపేట్(ఆర్మూర్) : మండలంలోని మూల మలుపులు ప్రమాదాలకు నిలయమవుతున్నాయి. కోట్లాది రూపాయలు ఖర్చుతో రోడ్డు వేసి ప్రమాదకర మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మూల మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కలు ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చేవరకు కనిపించడం లేదు. రాత్రు ల్లో మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని లక్కంపల్లి గ్రామంలో తారురోడ్డు, బజార్ కొత్తూర్ గ్రామం దాటిన తర్వాత చౌడమ్మ కొండూర్‌కు వెళ్లే రోడ్డు, ఉమ్మెడ, బాద్గుణ గ్రామాలకు వెళ్లే రోడ్డు కంఠం గ్రామ మూలమలుపులు పలు ప్రమాదాలకు నియలమవుతున్నాయి, అలాగే నందిపేట- నిజామాబాద్ ప్రధాన రోడ్డుకు పలుగుట్ట, విజయనగర్ గ్రామాల మధ్య ఉన్న మూలమలుపుల వద్ద గతంలో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ రోడ్డు గుండా వందలాది వాహనాలు నడుస్తుంటాయి.



సీహెచ్ కొండూర్ సమీపంలో..



బాద్గుణ గ్రామం వెళ్లేటప్పుడు..



లక్కంపల్లి గ్రామం వద్ద..

బలవంతంగా తైబజార్ వసూళ్లు

- ఆర్మూర్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గూడ్స్, ట్రాన్స్‌పోర్టు యజమానులు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో గూడ్స్, ట్రాన్స్‌పోర్టు వాహనాలకు బలవంతంగా తైబజార్ వసూలు చేస్తున్నట్లు యజమానులు బుధవారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో అధికారుల సమీక్ష సమావేశానికి కలెక్టర్ రావడంతో గూడ్స్, ట్రాన్స్‌పోర్టు యజమానులు కలిసి తమ గోడును విన్నవించారు. ఏప్రిల్ నెలలో రూ.30లక్షలకు తైబజార్‌ను వేలంలో ఓ వ్యక్తి దక్కించుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గూడ్స్, ట్రాన్స్‌పోర్టు వాహనాలకు తైబజార్ వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని యజమానులు వాపోయారు. కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రాజుకు సూచించారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



పెర్కిట్(ఆర్మూర్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో రాజ గంగారాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ నాయకుడు నాగరాజు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు విద్యార్థులకు యూనిఫాంలు అందజేయలేదన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పిల్లర్ల దశలో వంతెనలు



రాయకూర్ -బోధన్ శివారులో అసంపూర్తిగా ఉన్న వంతెన పనులు



కొల్లూర్- దొమలెడ్గి వాగు వద్ద ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

- రుద్రూర్ మండలం రాయకూర్ శివారు, కొల్లూర్- దొమలెడ్గి రోడ్డులో నిలిచిన పనులు
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రుద్రూర్: రుద్రూర్ మండలం రాయకూర్ శివారు నుంచి బోధన్ పట్టణానికి వెళ్లడానికి ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద 2023లో రూ.3 కోట్లు మంజూరు కావడంతో బ్రిడ్జి పనులు చేపట్టారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. ఈ వంతెన పూర్తయితే రాయకూర్, రాణంపల్లి, సిద్దాపూర్ గ్రామాలకు బోధన్ పట్టణానికి త్వరగా చేరుకోవచ్చు. పొలాలకు వెళ్లే రైతులకు సౌకర్యంగా ఉంటుంది. పోతంగల్ మండలం కొల్లూర్- దొమలెడ్గి రహదారిపై హైలెవల్ వంతెనె నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈవంతెన నిర్మాణానికి ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద 2023లో రూ.2.55 కోట్లు మంజూరు చేశారు. వర్షం కురిసినపుడు ఈరోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. తాత్కాలికంగా పక్క నుంచి రోడ్డు ఏర్పాటు చేశారు.అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

యూరియా కోసం పడిగాపులు



ఆర్మూర్‌లో క్యూలో నిలబడ్డ రైతులు



ముప్కాల్ మండల కేంద్రంలో..



ఇస్సాపల్లి సొసైటీ గోదాం వద్ద..

ఆర్మూర్‌టౌన్/బాల్కొండ/పెర్కిట్ : పట్టణంలోని పోచమ్మ గల్లీలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం రైతులు క్యూ లైన్ లో నిలబడి యూరియను బస్తాలను తీసుకున్నారు. ఎటువంటి తోపులాట జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రైతులకు టోకెన్ నెంబర్ ఇస్తు సొసైటీ సెక్రటరీ రాజేశ్వర్ రైతులకు యూరియా బస్తాలు అందజేశారు. ముప్కాల్ మండల కేంద్రంలో వేంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో యూరియా బస్తాలు ముప్కాల్‌కు వస్తున్నాయని సమాచారంతో రైతులు ముందుగానే గోదాం వద్ద పడిగాపులు కాశారు. వ్యవసాయ అధికారి సాయి కృష్ణ రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకున్నారు. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో యూరియా కోసం రైతులు ఉదయం నుంచి సొసైటీ గోదాం వద్ద బారులు తీరారు. సరిపడా యూరియా రాకపోవడంతో సొసైటీ గోదాము వద్ద సుమారు 200 మంది రైతులు పడిగాపులు కాశారు. 450 బస్తాలతో కూడిన ఒక లారీ లోడు రావడంతో మిగితా రైతులు నిరాశతో వెనుదిరిగారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



మోర్తాడ్‌లో సమ్మె కరపత్రాలను విడుదల చేస్తున్న మహిళలు

మోర్తాడ్/రుద్రూర్/వేల్పూర్ : డిమాండ్ల సాధన కోసం ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ప్రతినిధి, అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు కైరి దేవగంగు పిలుపునిచ్చారు. బుధవారం ఆమె మోర్తాడ్‌లో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వేల్పూర్‌లో సీఐటీయూ కార్యకర్తలతో కలిసి సమ్మె కరపత్రాలను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌బాబు ఆవిష్కరించారు. రుద్రూర్‌లో జీపీ కార్మికులు ఎంపీడీవో భీమ్‌రావుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ యూనియన్ మండలాధ్యక్షుడు అశోక్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రశాంత్



నియామకపత్రం అందుకుంటున్న ప్రశాంత్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణానికి చెందిన కలిగోట ప్రశాంత్ తెలంగాణ మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైయ్యారు. జిల్లా కేంద్రంలో బుధవారం మున్నూరుకాపు సంఘం తెలంగాణ ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల ప్రవీణ్, యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ అధ్యక్షతన సభ్యులు కలిగోట ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వారు ప్రశాంత్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలిగోట ప్రశాంత్ మాట్లాడుతూ రైతుల కోసం, విద్యార్థుల హాస్టల్స్ కోసం, బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం పోరాటం చేస్తామన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడుగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తం

విద్యార్థులకు ప్యాడ్లు, నోట్ బుక్స్ పంపిణీ

రెంజల్(బోధన్): మండలంలోని నీలా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం పలువురు దాతలు ప్యాడ్లు, నోట్ పుస్తకాలను అందించారు. నిజామాబాద్‌కు చెందిన మిత్ర గ్రూప్‌తో పాటు పతాంజలి మహిళా యోగా సెంటర్ మహలక్ష్మీ నగర్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థలు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు జలందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలు, ప్యాడ్లు, నోట్ పుస్తకాలను ఎంఈవో ఆంజనేయులు ద్వారా పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్, పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగంగ గౌడ్, కిషోర్ కుమార్,టీచర్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల తిరిగి అందజేత

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి బాధితులకు బుధవారం ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అందజేశారు. పొగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులకు మోతీరా, ప్రశాంత్, శ్రీనివాస్‌లకు అందజేశామన్నారు.

యూరియా కొరత లేదు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలో యూరియా కొరత లేదని, సొసైటీ గోదాముల్లో 2250 బస్తాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి మధుసూదన్ తెలిపారు. బుధవారం నికాల్‌పూర్‌లో సొసైటీ గోదామును పరిశీలించి యూరియా నిల్వలను పరిశీంచారు. మండలానికి మరో 1,350 బస్తాలు కూడా తెప్పిస్తున్నట్లు చెప్పారు.

అడ్వకేట్ ఎన్‌రోల్‌మెంట్ రద్దు

- నకిలీ సర్టిఫికెట్‌తో ప్రాక్టీస్ చేస్తున్నందుకు చర్యలు

నిజామాబాద్ లీగల్: నకిలీ సర్టిఫికెట్లతో తెలంగాణ బార్ కౌన్సిల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్న తొమ్మిది మంది అడ్వకేట్ల సభ్యత్వాన్ని తెలంగాణ బార్ కౌన్సిల్ రద్దు చేసింది. ఈ మేరకు బార్ కౌన్సిల్ సెక్రటరీ వి నాగలక్ష్మి ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ తొమ్మిది మందిలో నిజామాబాద్ నగరానికి చెందిన అజార్ శ్రావణ్ కుమార్(టీఎస్/1359/2008) అనే అడ్వకేట్ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు బార్ కౌన్సిల్ తెలిపింది. నకిలీ సర్టిఫికెట్లతో తెలంగాణ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నట్లుగా తనిఖీల్లో బయటపడటంతో సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు కౌన్సిల్ సెక్రటరీ నాగలక్ష్మి పేర్కొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



ఆర్మూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆర్మూర్ : పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆర్మూర్ బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షులు ఎం.నరేందర్ , జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారన్నారు. సుమారు రూ. 7 వేల కోట్ల బకాయిలు పెండింగ్ లో ఉంచడంతో విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలను విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆర్మూర్ ఏరియా పీడీఎస్‌యూ అధ్యక్షులు నిఖిల్, ప్రధాన కార్యదర్శి మమత, నాయకులు బాలకృష్ణ రాము, వివేక్ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.